క్లుప్తంగా

పచ్చ కర్పూరం అలంకారంలో గోవిందుడు



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఆదివారం స్వామికి పచ్చ కర్పూరంతో అలంకారం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కలశాలతో అష్టోత్తర కలశ స్నపన అభిషేకాలు, ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ చేపట్టారు. చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీ జగన్నాథ, శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ వెంకటేశ్వరస్వామి వార్ల దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ (సన్) ఆధ్వర్యంలో దివ్యాంగులైన విద్యార్థులతోపాటు ప్రతిభావంతులైన ఇతర విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. శ్యామలానగర్‌లోని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు నివాసంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 15 మంది విద్యార్థులకు మూడు వేల రూపాయల చొప్పున అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ వైకల్యం శరీరానికే తప్పా ప్రతిభకు కాదని, దివ్యాంగ విద్యార్థులు అందరితో సమానంగా చదువుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో సన్ నిర్వాహకులు యశ్వంత్, సాయి, ఆశిష్ పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల ఉన్నతికి రామ్మూర్తి కృషి



నెహ్రూనగర్: విశ్వ బ్రాహ్మణుల్ని బీసీల్లో చేర్చేందుకు గానాల రామ్మూర్తి ఎంతగానో కృషి చేశారని గుంటూరు పట్టణ సంఘం అధ్యక్షులు కడియాల సుబ్బారావు పేర్కొన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని విశ్వ బ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ రామ్మూర్తిని ఆదర్శంగా తీసుకుని సంఘ పురోభివృద్ధికి సభ్యులు కృషి చేయాలని కోరారు. అనంతరం ఉచిత వైద్య సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మేడపి వెంకట ప్రసాద్, మేడూరి శివరామకృష్ణ, పునపాటి శేష గిరిరావు, ఒంగోలు హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్‌ఈ హైస్కూల్ కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ అభినందనలు తెలియజేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని కార్యాలయంలో ఆదివారం ఆయన్ను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు పాటిబండ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దుర్వినియోగమవుతున్న పౌర స్మృతులు

పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న యశ్వంత్ కుమార్, నందకిశోర్, డొక్కా మాణిక్యవరప్రసాద్

నగరంపాలెం: పలు పౌర స్మృతులు (సివిల్ కోడ్‌లు) దుర్వినియోగం అవుతున్నాయని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు. సమాలోచన (మేధావుల వేదిక) గుంటూరు శాఖ ఆధ్వర్యంలో అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల ఆఫ్ ఫార్మసీ హాలులో ఆదివారం 'కామన్ సివిల్ కోడ్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య, గౌరవ అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. శ్రీమేధ విద్యా సంస్థల డైరెక్టర్ అన్నా నందకిశోర్ అధ్యక్షత వహించారు. ఉమ్మడి పౌరస్మృతి అవశ్యకత, పూర్వ రంగాన్ని ఆయన ప్రస్తావించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ మాట్లాడుతూ దుర్వినియోగమవుతున్న పౌర స్మృతుల్ని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గౌరవ అతిథి, తులసి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఎండీ తులసి యోగీశ్‌చంద్ర మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతి(కామన్ సివిల్ కోడ్)ని అమలు చేయడం ద్వారా భావాత్మక ఏకత సాధించవచ్చని తెలిపారు. ఉమ్మడి పౌరస్మృతి మత సంబంధాల్లో ఎందుకు జోక్యం చేసుకోదు.. ఏ విషయాలకు పరిమితమవుతుందనే అంశాలపై రాక లోకం చీఫ్ ఎడిటర్ రాక సుధాకరరావు వివరించారు. ఉమ్మడి పౌరస్మృతితో మహిళా సాధికారత, న్యాయమైన వారసత్వ, వివాహ, హక్కుల సార్వజనీనత ఎలా వస్తాయనేది తెలియజేశారు. సమాజానికి మేధోపరమైన నాయకత్వం అందించే వారు ఉమ్మడి పౌరస్మృతి కోసం పాటుపడాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సదస్సులో మాజీమంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, ప్రముఖ నాయకులు, న్యాయవాదులు జూపూడి రంగరాజు, బ్రహ్మానందరెడ్డి, కిడాంబి దేవరాజన్, జి.ఎ స్.పి. ముఖర్జీ ప్రసంగించారు. చివరగా లక్ష్మణ్ దేశభక్తి గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో మన్నవ బాలచంద్ర, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

నగరంపాలెం: కృష్ణనగర్ ఒకటో వీధిలోని శ్రీ గోదా పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం సాయంత్రం నవదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్ష కంకణధారణ, అంకురారోపణ, హోమం తదితర పూజల్ని నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున స్వామిని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీ ధనకుదరం శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ఈనెల 26 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

గురువుల సేవలు వెలకట్టలేనివి



సన్మాన గ్రహీతలతో బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని శ్రీ మాజేటి గురవయ్య హైస్కూల్లో జనవరి–జూన్ మధ్య ఉద్యోగ విరమణ చేసిన బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయుల్ని సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జూపూడి రంగరాజు మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించిన గురువుల సేవలు వెలకట్టలేనివని అభినందించారు. అంకితభావం, సేవానిరతితో వివిధ వృత్తుల ద్వారా సమాజానికి సేవ చేసిన ఉద్యోగులు, ఉపాధ్యాయుల్ని సమాజం ఎన్నటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. బ్రాహ్మణ ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సేవా సమితి అధ్యక్షుడు జె. పార్థసారథి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిజాయతీగా వ్యవహరించి ఉద్యోగులు, ఉపాధ్యాయులు భావి తరాలకు మార్గదర్శకులుగా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల్ని శాలువా, పూలమాలలు, జ్ఞాపికతో సత్కరించారు. సన్మాన గ్రహీతల జీవిత విశేషాల్ని వివరించారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి పి.ఎస్. శివన్నారాయణ, ఎంతఃవోలు బి.ఎం.శర్మ, నరసింహారావు, నాగరత్నం, ఏ.వి. హెచ్. ప్రసాద్, హెచ్‌ఎంలు నగేష్, ఈ.వి. శ్రీనివాస్, కె.వి.రమణ, హెచ్‌ఆర్ కోటేశ్వరరావు, సమితి ప్రతినిధులు సత్యనారాయణ, జి. వేణుగోపాల్, వ్యాఖ్యాత ఏ.వి. సుజాత పాల్గొన్నారు.

'సంస్కృతి' కృషి ప్రశంసనీయం



సంస్కృతి యువ నాటికలు గ్రంథావిష్కరణలో అతిథులు

సంస్కృతి యువ నాటికలు గ్రంథావిష్కరణలో వక్తలు

నగరంపాలెం: తెలుగు నాటక రంగంలో యువత పాత్రను ప్రోత్సహించేలా సంస్కృతి గుంటూరు కృషి ప్రశంసనీయమని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాశి విజయభాస్కర్ అన్నారు. సంస్కృతి గుంటూరు ఆధ్వర్యంలో 'సంస్కృతి యువ నాటికలు' గ్రంథావిష్కరణ ఆదివారం రాత్రి మార్కెట్ కూడలిలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. గ్రంథావిష్కరణ చేసిన ప్రముఖ నాటక రచయిత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ మాట్లాడుతూ బాలబాలికలు, మహిళలు లేని దుర్దశ తెలుగు నాటక రంగానికి రాకూడదన్నారు. సంస్కృతి వ్యవస్థాపకులు బాలచందర్ కృషి నాటక రంగానికి ఎనలేనిదని ప్రశంసించారు. గౌరవ అతిథి, ప్రముఖ చలనచిత్ర రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ కళలు కూడా సమాజంలో భాగం అన్నారు. యువతను నాటకం రంగం వైపు పాఠశాలలు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని ఆయన కోరారు. యువతకు నచ్చే విధంగా కథ, కథనంతో నాటకాలు రూపొందించాలని సూచించారు. నాటక రంగంలో కొత్త తరాన్ని ప్రోత్సహించాలి అనే సంకల్పాన్ని ప్రస్తుత తరం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల నిపుణులు కందిమళ్ల సాంబశివరావు, అభో– విభో– కందాళం ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య అప్పజోస్యుల సత్యనారాయణ, సంస్కృతి వ్యవస్థాపకులు ఎస్. బాలచందర్, రచయిత పిన్నమనేని మృత్యుంజయ రావు, మోదుగుల రవికృష్ణ పాల్గొన్నారు. యువ నాటిక పోటీల్లో విజేతలకు పురస్కారాలు అందించారు. అనంతరం వల్లూరి శివప్రసాద్ రచించిన ఉన్మాదం నాటక ప్రదర్శన ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది.

నీట్‌పై విద్యార్థినులకు ఉచిత అవగాహన తరగతులు

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ స్థాయిలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశానికై వచ్చే ఏడాది జరగనున్న నీట్‌కు సనద్ధమవుతున్న విద్యార్థినులకు మూడు రోజుల పాటు ఉచిత అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్‌లోని దోమలగూడకు చెందిన మెటామైండ్ అకాడమీ చైర్మన్ ఏ. మనోజ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, మొదటి ప్రయత్నంలోనే ర్యాంకు సాధన, మెంటార్‌షిప్, నోట్సు ప్రిపరేషన్ తదితర అంశాలపై మెడికోలు, సీనియర్ అధ్యాపకులు సమగ్ర అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన విద్యార్థినులకు ఉచిత హాస్టల్ వసతితో నిర్వహించనున్న అవగాహన తరగతులకు పేర్ల నమోదుకు 89199 26339 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డీఎస్‌నగర్‌లో నివసించే యల్లయ్య(35) ఇటీవల సోదరుడు మృతి చెందడంతో మనస్తాపానికి గురయ్యాడు. అద్దెకు ఉండే ఇంట్లో ఆదివారం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు పోలీసులు రుద్ర చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుల ద్వారా మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

గుంటూరు ఈస్ట్: పేకాడుతున్న ఐదుగురిపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కొబ్బరికాయల సాంబయ్య కాలనీలో కొందరు పేకాటాడుతున్నారనే సమాచారంతో ఆదివారం దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి మూడు వేల రూపాయల్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలి అర్బన్: శ్రీ వేంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యులు పాలడుగు వెంకటేశ్వర రావు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ శాంతి వృద్ధాశ్రమం, నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, శిరిడీ సాయి వృద్ధాశ్రమాల్లోని వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యోగా కేంద్రం కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య, పాలడుగు సుమత, పుష్పకుమారి, అనూష, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, మురళి, భారతి, సత్యనారాయణ, సునీత, కుర్రా శ్రీను పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విద్యా సరస్వతి హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయంలో తొమ్మిదోవ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం రెండో రోజుకి చేరాయి. ఎంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్, ఆలయ కమిటీ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాల్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నిత్య పూజలు, విద్యా సరస్వతి, నవగ్రహాలు, మాలికా పురోత్తమ అమ్మలకు విశేష అభిషేకాల్ని ఆలయ అర్చకులు కె.శివకుమారశర్మ, కె.చంద్రశేఖరశర్మ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. అనంతం వారికి తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం విద్యా సరస్వతి హోమం నిర్వహించారు. చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈనెల 24న ఉదయం శ్రీరామలింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమాలు, నవగ్రహ హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని ఆదివారం బీజేపీ గుంటూరు రూరల్ మండల అధ్యక్షుడు కంచర్ల రమేష్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.పాండురంగవితల్ మాట్లాడుతూ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆలోచన విధానాల్ని ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తూ అనేక సంక్షేమ పథకాల్ని దేశంలో ప్రవేశపెట్టారని తెలిపారు. అట్టడుగు వర్గాలకు సైతం సంక్షేమ ఫలాలు అందలనేదే శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆలోచన విధానమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి తోట శ్రీనివాస్, పలువురు నేతలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యాలయంలో...

డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా గుంటూరు లాల్‌పురం రోడ్డులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బలిదాన్ దీవార్ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమ నరేంద్రకుమార్, పలువురు నేతలు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్తా డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జీవిత చరిత్రను చదివి, ఆయన ఆలోచన విధానాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ భీమినేని చంద్రశేఖర్ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ స్వయం ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదానం చేశారని, ఆయన త్యాగం వల్లే ఈ రోజు కశ్మీర్ భారతదేశంలో ఒక రాష్ట్రంగా ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గాజుల వెంకయ్యానాయుడు, ఈదర శ్రీనివాసరెడ్డి, అన్నె పూర్ణచంద్రరావు, కుమార్‌గౌడ్, తోట శ్రీనివాస్, నడ్డి నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

అలరించిన సినీ సౌరభాలు



గీతాలు ఆలపిస్తున్న గాయనీ, గాయకులు

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం నిర్వహించిన మహతీ స్వర సుధ సినీ సౌరభాలు అలరించాయి. గాయనీ, గాయకులు రాజ్యలక్ష్మి, సువర్ణవిద్య, ముకుంద ప్రియ, లక్ష్మి, కృష్ణ, జరీనా, ప్రద్యుమ్న, మధుబాబు, సాయిబాబు తదితరులు వీనుల విందుగా గానం చేసి అలరించారు. కీబోర్డ్‌పై ప్రసాద్, తబలాపై వెంకట్, పాడ్స్‌పై ప్రసాద్ వాయిద్య సహకారం అందించారు. కృష్ణప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మదన్మోహన్ పాల్గొన్నారు.

మంత్రి భూపతిరాజు వర్మను కలిసిన బీజేపీ నేతలు



మంత్రి వర్మను సన్మానిస్తున్న నేతలు

గుంటూరు మెడికల్: కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు వర్మను ఆదివారం భీమవరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో భారీ పరిశ్రమలు స్థాపిస్తే రాజధాని ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని నరేంద్రకుమార్ తెలిపారు. జిల్లాకు పెట్టుబడులు వచ్చేలా, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చేలా చూడాలని ఆయన్ను కోరారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో తమనంపూడి రామకృష్ణారెడ్డి, నడ్డి నాగమల్లేశ్వరి, చావలి పద్మ, సుకన్య ఉన్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నగరంపాలెం:స్థానిక ఎస్‌వీఎస్ కాలనీ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, అగ్ని ధ్యానం, నవగ్రహారాధన, శ్రీ వెంకటేశ్వర మూలమంత్ర హోమం తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో పురవీధుల్లో శ్రీవారి రథోత్సవం అత్యంత వైభవంగా కొనసాగింది. 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ ప్రసాద్ రథోత్సవాన్ని ప్రారంభించగా, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బాల ముకుంద కోలాట బృందం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వట్టికూటి పూర్ణచంద్రరావు, కార్యదర్శి నల్లమోతు వెంకటరత్తయ్య, కోశాధికారి పుచ్చ వెంకటమల్లేశ్వర్, ఉపాధ్యక్షులు పావులూరి కిశోర్, సంయుక్త కార్యదర్శి ఇమ్మడి శ్రీనివాసరావు, నైషధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అతిథులు

నగరంపాలెం: ఉయ్ ఆర్ విత్ యూ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ వారధిలో భాగంగా ఆదివారం 80 మందికి పైగా పిల్లలకు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో వైద్య పరీక్షలు, ఔషధాలతో పాటు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్, విల్సార్ట్ ఎండీ వెచ్చా వీరేంద్ర, ఆపద్బాంధు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు జాగర్లమూడి ఆంజనేయులు, హోప్ విన్ హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ షమ సుల్తానా, జేసీఐ మాజీ అధ్యక్షుడు నిశ్చల్ హాజరయ్యారు. ట్రస్ట్ సేవల్ని అభినందించారు. సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ ఎస్. అయ్యప్ప మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. విద్యార్థుల చదువు కోసం సాయం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

డయేరియా కేసులపై దృష్టి సారించండి

మంత్రి నాదెండ్ల మనోహర్



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి: వర్షాకాలం కావడంతో అక్కడక్కడా డయేరియా కేసులు వస్తున్నాయని, కేసుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. తెనాలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మనోహర్ ముందుగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో అభివృద్ధి పనులను సమీక్షించారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యాశాఖ, వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడారు. అన్ని శాఖల్లో ప్రాధాన్యత కలిగిన పనులను ఎప్పటికప్పుడు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. నందివెలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లోని సమస్యలను వివరించాలని కోరగా మురుగునీటి కాల్వలు, విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి సమస్యలను పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రస్తావించారు. విద్యుత్ అంతరాయాలకు కారణమేమిటని మంత్రి సంబంధిత అధికారులను అడిగారు. త్వరిత గతిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన బాధిత రైతులు

దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని బాధిత పసుపు రైతులకు న్యాయం చేయాలని కోరుతూ ఏపీ పసుపు రైతుల సంఘం ఆధ్వర్యంలో బాధితులు ఆదివారం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. స్థానిక జనసేన కార్యాలయంలో మంత్రిని కలిసిన రైతులు వినతి పత్రం అందజేశారు. పసుపు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మలకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కోల్డ్ స్టోరేజీలో పసుపు దగ్ధమై అయిదు నెలలు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు ఆందోళన పడుతున్నారని చెప్పారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ ముందు రైతులంతా ఇన్సూరెన్స్ డబ్బులు తీసుకోవాలని సూచించారు.సమస్యను మంగళగిరి ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి వచ్చే సాయం కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. పసుపు రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య, లంకిరెడ్డి నాగేశ్వర రెడ్డి, నాదెళ్ల చంద్రశేఖర్, సుబ్బారావు పాల్గొన్నారు.

దాతల ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి ఎదగాలి



తెనాలి: ప్రతిభావంతులైన పేద విద్యార్థులు దాతల ప్రోత్సాహాన్ని వినియోగించుకుని క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని హైదరాబాద్‌కు చెందిన క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సాయిరామ్ సూచించారు. పట్టణానికి చెందిన శ్రీ వీరబ్రహ్మేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముత్యంశెట్టి వారిపాలెంలోని పద్మశాలీయ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన సభలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ట్రస్ట్ తరపున ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్ ఈఎల్‌వీ అప్పారావు అధ్యక్షత వహించారు. విజయవాడకు చెందిన ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ వజ్రాల శివకుమార్ తన ప్రసంగంలో విద్య, వినయం, భక్తి శ్రద్ధలను అలవరచుకోవాలని సూచించారు. స్వామీజీ బ్రహ్మంగారి కాలజ్ఞానం గురించి, కాళికాంబ సప్తశతి పద్యాలను ఉదహరిస్తూ తమ ప్రసంగాన్ని కొనసాగించారు. వేద ధర్మాల గురించి కల్యాణి వివరించారు.